సాక్షి
అనకాపల్లి
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



అమ్మంత అభిమానం

కమ్యూనిస్టు నాయకురాలు పార్వతమ్మకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు నివాళులర్పించారు.

8లో



ఐఎన్ఎస్ సింధుకేసరి

విశాఖ: ఇండోనేషియాలో ఐఎన్ఎస్ సింధు కేసరి పర్యటన ముగిసింది. ఈ నెల 22న సిబ్బందితో జకార్తా సందర్శనకు వెళ్లింది.

వాతావరణం

అనకాపల్లిటౌన్ : రాగల అయిదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 31.5 నుంచి 31.8 డిగ్రీలు. గాలిలో తేమ శాతం 80 నుంచి 82. గాలిగంటకు 5 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

ముగింపు దిశగా నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల ధర్నా ముగింపు దిశగా పయనిస్తోంది. శుక్రవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పంపిన మినిట్స్‌ను నేవీ డీటీ శాంతి భూషణ్ ధర్నా శిబిరం వద్ద చదివి వినిపించారు. దీనిపై నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు సానుకూలత వ్యక్తం చేశారు. దీనిపై మరింత లోతుగా చర్చించుకుని శనివారం ధర్నా ముగించే అవకాశాలున్నాయని ఉద్యమ ఐక్యవేదిక నాయకులు చింతకాయల ఎర్రయ్య స్పష్టం చేశారు. శుక్రవారం నాటికి ధర్నా 117వ రోజుకు చేరుకుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

తుమ్మపాల: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉండాలని సహాయ ఎన్నికల అధికారి, డీఆర్వో పి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సెక్టోరియల్, రూట్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని ప్రశాంతంగా ఎన్నికలు జరిపే బాధ్యత అధికారులందరిపైనా ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధిగా పనిచేయాలని సూచించారు. జీఎస్‌వీఎస్ ప్రతేకాధికారి మంజులా వాణి, డ్వామా పీడీ సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైకిల్‌పై షిర్డీ యాత్ర



సైకిల్‌పై షిర్డీకి బయలుదేరుతున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలం నుంచి ఆరుగురు భక్తులు షిర్డీకి సైకిల్‌పై పయనమయ్యారు. లోక కల్యాణార్థం, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు భక్తుడు పూడి నాగు తెలిపారు. గతంలో ఆరు సార్లు షిర్డీకి వెళ్లినట్లు చెప్పారు. సైకిల్ యాత్రను ప్రారంభించిన వారిలో మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శరగడం జగ్గారావు, తనకాల లక్ష్మి, పోలారపు జగ్గారావు, పూడి నానాజీ, పూడి గోవింద, ఎ.బుజ్జి, బత్తిన నాగార్జున తదితరులున్నారు.

బీచ్..బ్యూటీ.. బిజినెస్..!



సుందరంగా రుషికొండ సాగర తీరం

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

- అడుగడుగునా ఆంధ్ర సౌరభం
- 26 కిలోమీటర్ల మేర 7 లక్షల మొక్కల పెంపకం
- కొత్త బీచ్‌ల అభివృద్ధి... మరింత అందంగా సముద్ర తీరం
- సరికొత్త వైజాగ్‌ను పరిచయం చేస్తాం

ఒకవైపు బీచ్ అందాలను...మరోవైపు వైజాగ్ బ్యూటీని విదేశీ, దేశీయ అతిథులతో పాటు పారిశ్రామికవేత్తలకు పరిచయం చేసేందుకు నగరం సిద్ధమవుతోంది. నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఆత్మీయ స్వాగతంతో పాటు అడుగడుగునా విశాఖ అందాలను కనువిందు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)తో పాటు జీ-20 సదస్సుకు విచ్చేయనున్న అతిథులకు విమానం దిగిన తర్వాత సంప్రదాయపద్ధతిలో స్వాగతం పలకనున్నారు. అంతేకాకుండా అక్కడి నుంచి బయలుదేరిన తర్వాత ఎన్ఏడీ జంక్షన్, తాటిచెట్లపాలెం, ఆంధ్రాయూనివర్సిటీ ప్రధాన ద్వారం, సిరిపురం, ఆర్‌కే బీచ్ మీదుగా జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మీదుగా రాడిసన్ హోటల్ వరకూ విశాఖ నగర అందాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'సరికొత్త వైజాగ్‌ను పరిచయం చేసేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో అతిథులను వైజాగ్ అందాలు కట్టిపడేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జీ-20 సదస్సు నేపథ్యంలో పనులను చేపట్టేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకి కూడా తొలగిపోయింది. ఎన్నికల కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది' అని జీవీఎంసీ కమిషనర్ రాజబాబు తెలిపారు. నగర ప్రజలందరూ ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. జీఐఎస్, జీ-20 సదస్సు నేపథ్యంలో జీవీఎంసీ చేపడుతున్న చర్యలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

జీ-20కు విచ్చేయనున్న అతిథులకు ఆంధ్ర సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే విధంగా స్వాగతం పలుకుతాం. కళాజాత కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రధానంగా మన రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక కళారూపాల ద్వారా అతిథులను ఆత్మీయంగా పలకరింపుతో పాటు స్వాగతాంజలి ఉంటుంది. ఇక విమానాశ్రయం నుంచి వారు ప్రయాణించే మార్గంలో రోడ్డు మొత్తం జీ-20 బ్రాండింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడికక్కడ సెంట్రల్ మెరీడియన్‌లో లైట్లతో అలంకరించడంతో పాటు ఫ్లవర్ షోతోపాటు రోడ్డుకు అటుఇటుగా చక్కటి పెయింటింగ్స్ అలరించేలా ప్లాన్ చేస్తున్నాం. 26 కిలోమీటర్ల మేర 7 లక్షల మొక్కల పెంపకం చేపట్టనున్నాం. వైజాగ్‌కు ప్రకృతి ఇచ్చిన అందం ఉంది. దీనికి అదనంగా మరింత అందంగా తీర్చిదిద్దే పనిని చేపడుతున్నాం. విశాఖను మరింత ఎంజాయ్ చేసే విధంగా ప్లానింగ్ చేస్తున్నాం. ఇక రోడ్డుకు అటుఇటువైపుగా ఉన్న పేవ్‌మెంట్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం.

మరింత దగ్గరగా సముద్ర అందాలు

ఇప్పటికే ఉన్న బీచ్‌లతో పాటు కొత్త బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. జోడుగుళ్లపాలెం, సీతకొండ వద్ద వ్యూ పాయింట్ అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడి నుంచి మరింతగా సముద్రపు అందాలను వీక్షించే అవకాశం ఉంది. ఆ తర్వాత సాగర్‌నగర్ వద్ద బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే ఉన్న బీచ్‌లకు ఇవి అదనంగా ఏర్పాటవుతున్నాయి. అంతేకాకుండా మొత్తం సముద్ర తీరం మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే బీచ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖకు రానున్న అతిథులకు విశాఖను మరింతగా పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమాలు దోహదం చేస్తాయి. ఈ అవకాశాన్ని మేం సమర్థవంతంగా ఉపయోగించుకుంటాం.

జన్‌బాగ్‌దారీ..

జీ-20లో నగర ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తాం. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మార్చి 5వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ జన్‌బాగ్‌దారీ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తాం. సైకిల్ మారథాన్, వాకింగ్ మారథాన్, రన్నింగ్ మారథాన్ వంటి కార్యక్రమాలతో పాటు సిటీ మొత్తం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం చేపడతాం. అంతేకాకుండా వైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో ఆర్‌కే బీచ్ వద్ద ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా స్టేజీ ఏర్పాటు చేస్తున్నాం. యువతీ, యువకులు వారికి ఉన్న టాలెంట్‌ను పరిచయం చేసుకునేందుకు ఈ స్టేజీ వీలు కల్పించనుంది. రిజిస్టర్ చేసుకుని ఇందులో పాల్గొనే అవకాశం కల్పించనున్నాం. అంతేకాకుండా పెయింటింగ్, వక్తృత్వ పోటీలను కూడా నిర్వహిస్తాం. కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులతో మాక్ జీ-20ను నిర్వహించనున్నాం.

అతిథుల కోసం...!

జీ-20 సదస్సుకు వస్తున్న అతిథుల కోసం ప్రత్యేకంగా 30వ తేదీన వైజాగ్‌లో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలను పరిచయం చేయనున్నాం. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి తయారు చేస్తున్న ప్రాంతం.. దీనిని వేస్ట్ టు వెల్త్ ఏరియాగా పరిచయం చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రవేశద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ ఏ విధంగా విశాఖపట్నంలోని చెత్తను విద్యుత్‌గా మార్చుతున్నామన్న విషయాన్ని వివరించేందుకు వీలుగా ఉంటుంది. అదేవిధంగా ముడసర్లోవలోని నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంటును సందర్శించే విధంగా ప్లాన్ చేస్తున్నాం. దీంతో పాటు నరవ వద్ద మురికినీటిని శుద్ధి చేసి మంచినీటిగా మార్చే ట్రీట్‌మెంట్ ప్లాంటును చూపించనున్నాం. ఈ నీటిని పరిశ్రమలకు సరఫరా చేస్తున్నాం. సముద్రతీరం ద్వారా వ్యాపార అవకాశాలనూ వివరించే ప్రయత్నం చేస్తాం. మొత్తంగా వైజాగ్ బీచ్...బ్యూటీతో పాటు అభివృద్ధి కేంద్రంగా ఎలా మారుతుందన్న అంశాన్ని అతిథులకు చూపించనున్నాం.



బీచ్ రోడ్డులో మెరుగులు



ఐటీ సెజ్ రోడ్డులో వివిధ ఆకృతుల్లో చెట్లు

కొత్త గవర్నర్‌కు డిప్యూటీ సీఎం బూడి శుభాకాంక్షలు



రాజ్‌భవన్‌లో రాష్ట్ర కొత్త గవర్నర్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అభినందనలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిప్యూటీ సీఎంను గవర్నర్‌కు పరిచయం చేశారు. బూడి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ సీతారామమూర్తి



ఆశీర్వచనం స్వీకరిస్తున్న జస్టిస్ సీతారామమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గౌరవాధ్యక్షుడు జస్టిస్ ఎం.సీతారామమూర్తి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని,శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

నాలుగు నామినేషన్ల తిరస్కరణ



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

- పరిశీలన పూర్తి
- బరిలో మిగిలిన 40 మంది అభ్యర్థులు
- 7 వరకు ఉపసంహరణకు గడువు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ సమక్షంలో శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి 23వ తేదీ వరకూ మొత్తం 44 మంది అభ్యర్థులు 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, ఆయా అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మొత్తం 70 సెట్లు నామినేషన్లను కలెక్టర్ స్క్రూట్నీ చేశారు. విశాఖ జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ నామినేషన్లను తిరస్కరించారు. విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 44 నామినేషన్లకు సంబంధించి నాలుగు నామినేషన్లు తిరస్కరించినట్లు కలెక్టర్ డా. మల్లికార్జున వెల్లడించారు. ఈనెల 27 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు.

బీభత్సం.. భయానకం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరసయ్యను మోసుకొని వస్తున్న ఎస్ఐ ప్రసాదరావు.. కాసేపటికే అతను మరణించాడు



ప్రమాదానికి కారణమయిన లారీ

పెద్ద శబ్దం.. స్థానికులు ఏమిటా అని చూసేసరికి.. వరాహ నది కాలువలోకి దూసుకుపోయిన బస్సు.. తుక్కుతుక్కయిన బస్సు వెనుకభాగం.. పక్కనే నుజ్జయిన ఆటో.. చెల్లాచెదురుగా క్షతగాత్రులు.. ఆర్తనాదాలు.. హాహాకారాలు.. ఎస్.రాయవరం మండలంలోని పి.ధర్మవరం జంక్షన్‌లో జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాద బీభత్సమిది.. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 25మంది గాయపడ్డారు. ఐదుగురు తీవ్ర గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

- ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి.. 25మందికి గాయాలు
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో పరిమితమైన ప్రాణనష్టం
- స్థానికులు, పోలీసుల సేవలకు ప్రశంసలు

ఎస్.రాయవరం: అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళుతున్న బస్సు.. పి.ధర్మవరం జంక్షన్‌లో ఆగింది. నలుగురు ప్రయాణికులు దిగారు. మరో ఇద్దరు ఎక్కుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రయాణికులు ఎక్కిన వెంటనే స్టార్ట్ చేద్దామనే ఆలోచనతో ఎగువ ప్రాంతంలో బస్సును నిలిపి, స్టీరింగ్ పట్టుకుని డ్రైవర్ అప్రమత్తంగా ఉన్నారు. అదే ప్రయాణికులను కాపాడింది. లేకుంటే వరాహనది బ్రిడ్జికి అతి సమీపంలో ఉండడంతో బస్సు బోల్తా కొడితే తీవ్ర ప్రాణనష్టం జరిగి ఉండేది. ప్రమాదం జరిగే సమయానికి బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. యలమంచిలి వైపు నుంచి తుని వైపు వెళుతున్న పంజాబ్ లారీ అతివేగంగా వచ్చి బస్సును వెనుక నుంచి ఢీకొని, అదే వేగంతో డివైడర్ దాటి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయానికి బస్సు సమీపంలో ఒక ఆటో కూడా ఉంది. లారీ ఢీకొనడంతో బస్సు, ఆటో పక్కనున్న వరాహనది కాలువలోకి దూసుకుపోయాయి. వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించడంతో క్షతగాత్రులకు తక్షణ వైద్యసేవలు అందాయి. గాయపడిన వారిని నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆటోల్లో, 108 వాహనంలో తరలించారు. ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాదరావు క్షతగాత్రులను మోసుకొని పైకి తీసుకువచ్చి ఆస్పత్రికి పంపించారు.

కూటి కోసం వచ్చి కాటికి..

ప్రమాదంలో తలకు గాయమైన విశాఖపట్నం ఇసుకతోట ప్రాంతానికి చెందిన మడపల్లి పరసయ్య (50) నక్కపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. ఇతను నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపెనీల్లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. స్థానికంగా నివాసం ఉంటూ వారానికి ఒకరోజు విశాఖలో కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వస్తుంటారు. శుక్రవారం ఇంటి నుంచి నక్కపల్లి వస్తూ బస్సు ప్రమాదంలో మరణించారు.

తర్వాతి స్టాపులో దిగాల్సివుండగా..

బస్సు వెనుక భాగంలో కూర్చున్న ఎస్.రాయవరం మండలం పెద గుమ్ములూరుకు చెందిన ఏజెర్ల నారాయణరాజు (52) వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యారు. ఆయనను నక్కపల్లి ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మరణించారు. ఇతను కూడా రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తాళ్లపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డారు. తర్వాతి స్టాపు అడ్డురోడ్డులో ఇతను దిగాల్సి ఉంది. ఇంతలోనే ప్రమాదం కబళించింది.

మిన్నంటిన ఆర్తనాదాలు

బస్సులో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఉండటంతో భయంతో ఆర్తనాదాలు చేశారు. స్థానికులతో పాటు సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు, ట్రాఫిక్ పోలీసులు, హైవే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీసి ఆటోల్లోను, 108 వాహనంలోను ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో నక్కపల్లి ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. లింగరాజుపాలెం గ్రామానికి చెందిన ప్రయాణికుడు సత్యనారాయణరాజు బస్సు దిగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. అతనికి కూడా గాయాలయ్యాయి. గాజువాక చెందిన అనంతలక్ష్మి అనే మహిళ పాయకరావుపేట వెళుతోంది. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు విరిగిపోయింది. ఎస్.రాయవరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇళ్ల నాగరాజు అనే మహిళ పాయకరావుపేట వెళ్లడానికి అక్కడే బస్సు ఎక్కింది. వెంటనే ప్రమాదం జరిగింది. నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు కూడా ఈ బస్సులోనే ప్రయాణిస్తున్నారు. వారికి కూడా కవుకు దెబ్బలు తగిలాయి.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే బాబూరావు పరామర్శ

సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సహాయక చర్యలు వేగం పెంచాలని ఆదేశించారు. నక్కపల్లి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత ప్రమాద స్థలాన్ని పరిశీలించి నక్కపల్లి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

క్షతగాత్రులు వీరే..

ఆటో డ్రైవర్ గొర్ల కృష్ణ, లారీ క్లీనర్ సుఖీమర్, బస్సు డ్రైవర్ ఇసరపు రమణ, కండక్టర్ కె.లక్ష్మి, ప్రయాణికులు.. నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన కొఠారి నాగమణి, వెదుళ్ల మంగ, గొల్లపల్లి నాగరత్నం, తుని మండలం సూరవరానికి చెందిన పి.రాజుబాబు, అనకాపల్లికి చెందిన రామ్మోజి రామలక్ష్మి, ఆనంద్, విశాఖపట్నానికి చెందిన ఎం.సత్యనారాయణ, పి.శేషు, యలమంచిలికి చెందిన కె.నూకరత్నం, బి.అప్పారావు, అప్పలనర్స, విజయనగరానికి చెందిన హెటిరో డ్రగ్స్ ఉద్యోగి ఎ.నరేష్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చలాది నాగరాజు, శేషుశర్మ, కె.మణి, ఆర్.రాము, సతీష్, పి.మౌనిక, వర్షిణి, బి.లక్ష్మీరాజమ్మ, వరలక్ష్మి, సత్యవతి, ఎ.అప్పారావు, కె.దేవి, నాగరాజు, కె.లక్ష్మి, బి.జయలక్ష్మి, కె.వి.ఎస్.సుబ్బారావు



ప్రమాదంలో గాయపడిన మహిళలు





సంఘటన స్థలంలో ప్రమాద బీభత్సం (ఇన్‌సెట్) మృతుడు నారాయణరాజు (ఫైల్)



ధ్వంసమైన బస్సును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


పట్టాలపై మృతదేహం

పాయకరావుపేట: మండలంలోని నామవరం సమీపంలో రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఈ వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న రైలు ఢీకొన్నట్టు చెప్పారు. మృతుడి వద్ద ఏ విధమైన వివరాలు లేవని, సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, గోల్డ్ కలర్ షర్ట్, బ్లూ కలర్ గడుల లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు.

'నీరు'త్సాహం లేదిక!

- ఈ వేసవి నుంచే పుష్కలంగా తాగునీరు
- చోడవరం పట్టణ ప్రజల దీర్ఘకాలిక కష్టాలకు చెక్
- రూ. 12.80 కోట్లతో భారీ మంచినీటి పథకం నిర్మాణం
- చివరి దశలో తాగునీటి పనులు


ఇంటింటా కుళాయిల కోసం వేస్తున్న పైపులైన్లు

చోడవరం: పట్టణ ప్రజలను దీర్ఘకాలంగా వెంటాడుతున్న తాగునీటి కష్టాలు త్వరలో తీరనున్నాయి. తమ దాహార్తి తీర్చాలని వేడుకున్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి రూ. 12.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన భారీ మంచినీటి ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయి. 25 వేల మంది ఉన్న చోడవరం పట్టణం పరిధిలో భూగర్భ జలాలు తాగునీటికి ఉపయోగకరంగా లేకపోవడంతో ఇప్పటి వరకు అరకొరగా ట్యాంక్‌ల నీటి సరఫరా చేసేవారు. దీంతో బిందెడు నీళ్ల కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక శ్రద్ధ చూపారు. జలజీవన్ మిషన్ పథకంలో గతేడాది రూ. 12.80 కోట్లు మంజూరు చేయించారు.

5 వేల ఇళ్లకు కుళాయిల ఏర్పాటు

ప్రధానంగా పట్టణంలో 9.50 లక్షల కెపాసిటీ కలిగిన ఏడు మంచినీటి వాటర్ ట్యాంక్‌లకు పంపింగ్ చేసేందుకు సమీపంలో పీఎస్‌పేట దగ్గర పెద్దేరు నదిలో గ్రౌండ్ లెవిల్ బ్యాలెన్సింగ్ ట్యాంక్ రిజర్వాయరు నిర్మించడంతోపాటు పట్టణంలో ప్రతీ ఇంటికీ కుళాయిలు ఇచ్చే విధంగా ఈ పథకాన్ని మంజూరు చేశారు. దీంతో పథకం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 5 వేల ఇళ్లకు కుళాయిల కోసం వీధుల్లో 70 కిలోమీటర్ల ప్రత్యేక పైప్‌లైన్ వేయడానికి ప్రతిపాదన ఉండగా, ఇప్పటి వరకు 55 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి 3 వేల ఇళ్లకుపైగా ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. మరో 15 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి మరో 2 వేల ఇళ్లకు కుళాయిలు ఇచ్చేందుకు పనులు చేస్తున్నారు.

బెన్నవోలు కొండపై బ్యాలెన్సింగ్ రిజర్వాయరు

మరో పక్క పెద్దేరు నదిలో నిర్మించిన పంపుహౌస్ పనులు 80 శాతానికి పూర్తిగా వరదలు వచ్చినప్పుడు సైతం ఈ పంపు హౌస్ దగ్గరకు వెళ్లేందుకు వీలుగా జన్నవరం వంతెన సమీపంలో నది ఒడ్డు నుంచి ఫుట్‌వే వంతెన నిర్మాణ పనులు జోరుగా చేస్తున్నారు. బెన్నవోలు కొండపై 60 వేల లీటర్ల కెపాసిటీతో గ్రౌండ్‌లెవిల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ట్యాంక్‌ను ఇప్పటికే నిర్మించారు. నదిలో పంప్ హౌస్ నుంచి ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు నీరు పంపింగ్ అయ్యి అక్కడ నుంచి చోడవరం పట్టణంలో 7 ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటి సరఫరా చేసేందుకు వీలుగా సుమారు 5.7కిలోమీటర్ల మేర ప్రత్యేక మెయిన్ పైపులైన్ వేశారు. ఇంత భారీ మంచినీటి ప్రాజెక్టు ఏకకాలంలో వేగవంతంగా పనులు చేస్తున్నారు. యడ్లవీధి ట్యాంక్‌తోపాటు కొన్ని ప్రాంతాలకు ఇంటింటి కొళాయిలు ఇవ్వాల్సి ఉండగా వాటి పైప్ లైన్ పనులు జోరుగా చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తిచేసి ఈ వేసవిలోగా పూర్తిగా పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజల మంచినీటి కష్టాలు తీర్చేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, జలజీవన్‌మిషన్ పథకం అధికారులు సంయుక్తంగా పనిచేస్తున్నారు. ఈ పథకం పూర్తయితే దీర్ఘకాలంగా మంచినీటి కోసం పడుతున్న చోడవరం ప్రజల తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోనున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేరు నది మధ్యలో పీఎస్‌పేట వద్ద నిర్మిస్తున్న భారీ మంచినీటి పథకం పంప్ హౌస్

వేగంగా పనుల పూర్తికి చర్యలు

భారీ మంచినీటి పథకం పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. వేసవిలోగా పథకాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. పంప్ హౌస్ పనులు మరింతగా వేగంగా పూర్తికి చర్యలు చేపట్టాం.

– శివకృష్ణ, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చోడవరం

ఈనాడు దినపత్రిక ప్రతుల దహనం

- చోడవరంలో మానవహారం, రాస్తారోకో


ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు

చోడవరం: తప్పుడు వార్తలతో ప్రజలను మభ్యపెడుతున్న ఈనాడు దినపత్రిక యాజమాన్యంపై జనాగ్రహం వ్యక్తమవుతోంది. ఆ దినపత్రిక ప్రతులను చోడవరంలో పలువురు దహనం చేసి శుక్రవారం తమ నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద భారీ ఎత్తున రాస్తారోకో చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. చంద్రబాబుకు మేలు చేసే విధంగా ఆ పత్రికలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దిగజారుడు రాతలు రాసిందని ధ్వజమెత్తారు. ఈనాడు అధినేత రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పతివాడ అప్పారావు, చోడవరం పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్ లీడర్ సూరిశెట్టి నాగదుర్గగోవింద, బుచ్చెయ్యపేట ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ దేవర అప్పారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్రాన్స్ ప్రొఫెసర్

- తెలుగు భాషపై అనర్గళంగా మాట్లాడిన డేనియల్ నెజర్స్
- మంత్రముగ్ధులైన విద్యార్థులు

అనకాపల్లి రూరల్: ఆయన ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్రముఖ ప్రొఫెసర్. తెలుగు భాష గురించి ఆయనకేమి తెలుస్తుందను కున్నారంతా. కానీ అలా అనుకున్న వారందరినీ ప్రొఫెసర్ డేనియల్ నెజర్స్ చేసిన తెలుగు ప్రసంగం ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే..శుక్రవారం అనకాపల్లిలోని హిమశేఖర్ పాఠశాలలో తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగుకు వెలుగునిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ కన్వీనర్ కొయిలాడ రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఫ్రాన్స్ దేశంలో ఆంత్రోపాలజీ శాస్త్రం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డేనియల్ నెజర్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రపంచంలో అనేక దేశాల్లో ఉన్న భాషల గురించి డేనియల్ అధ్యయనం చేస్తున్నారని కొయిలాడ రామ్మోహన్ చెప్పారు. ఈ సందర్భంగా డేనియల్ నెజర్స్ మొదటి నుంచి తెలుగులో అనర్గళంగా మాట్లాడడంతో విద్యార్థులతో పాటు అక్కడున్నవారందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. తెలుగు భాషకు ప్రపంచ దేశాల్లో ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడానికి వచ్చిన తాను ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరై అక్కడి నుంచి అనకాపల్లి వచ్చానని చెప్పారు. అనంతరంఅనర్గళంగా ప్రసంగించిన డేనియల్‌ను పలువురు అభినందించారు. సమితి సభ్యులు ఆయనను సత్కరించారు. సమావేశానికి హాజరైన రాచకొండ దశరథ రామయ్య, డి.శశిధర్ మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యం గురించి వివరించారు. విశ్రాంత ఐజీ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుభాష కోసం ఇటువంటి సేవలు చేయడం చాలా గొప్ప పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యులు తమ్మిరాజు, శ్రీనివాసాచార్యులు, జి.రంగబాబు, అమరజ్యోతి, గాయత్రి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ డేనియల్ నెజర్స్‌ను సత్కరిస్తున్న తెలుగు పరిరక్షణ సమితి సభ్యులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్: నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించిన 314 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా వాహనాల యజమానుల నుంచి ఈ చలానా ద్వారా రూ.80,675 వసూలు చేసినట్టు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. 28 కిలోల గంజాయితో పాటు ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పార్వతమ్మ అంటే అమ్మంత అభిమానం

- సీపీఎం పొలిట్ బ్యూరో బీవీ రాఘవులు


అంతిమ యాత్రలో పాల్గొన్న జనం

అచ్యుతాపురం(అనకాపల్లి): కమ్యూనిస్టు నాయకురాలు పార్వతమ్మ మరణం తనను తీవ్రంగా బాధించిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు అన్నారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో శుక్రవారం కామ్రేడ్ పార్వతమ్మ అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె పార్థివదేహానికి రాఘవులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మందికి ఉద్యమంలో శిక్షణ ఇచ్చినామె ఇక లేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక పోతున్నానని ఉద్వేగానికి గురయ్యారు. జాతీయ, రాష్ట్రీయ నాయకురాలు పార్వతమ్మ వద్దకు వచ్చి అనేక అంశాలపై స్ఫూర్తి పొందేవారని పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ పార్వతమ్మ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటుగా అభివర్ణించారు. తన భర్త బాటలోనే ఉద్యమాల్లో పాల్గొన్నారని, తన పిల్లలకు సైతం కమ్యూనిస్టు భావాలను కలిగించారని తెలిపారు. గ్రామాభివృద్ధితోపాటు ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగలి రాము అధ్యక్షతన సంతాప సభ జరిగింది. అనంతరం తిమ్మరాజుపేట శ్మశాన వాటిక వరకు భారీ జనసమూహం మధ్య అంతిమ యాత్ర నిర్వహించారు. సీఐటీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, శ్రీనివాస్, వి. కుమార్, గనిసెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు, బి. పద్మ, సుమిత్ర, కోన బుజ్జి, బి. రాం దాస్, కర్రి ఆదిబాబు, నాగమణి, గుర్రం రమణ, రామ్‌కుమార్, ఆత్మారాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ


రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి

తుమ్మపాల : రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయనతో పాటు ఎస్పీ గౌతమి సాలి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రతి చోటా హెచ్చరిక బోర్డులు, నిరోధకాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ సమావేశాల నిర్వహణలో స్వయం సహాయక సంఘాల మహిళలు, లబ్ధిదారులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేయాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్టు తప్పక ధరించాలన్నారు. పెందుర్తి, అనకాపల్లి ఆరులైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో రోడ్లకు మరమ్మతులు చేపట్టి సౌకర్యవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే ప్రమాదాల నెలవుగా గుర్తించిన 39 బ్లాక్‌స్పాట్లను పోలీసులు, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులు ఉమ్మడిగా పరిశీలించి తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారులపై కొన్ని ప్రదేశాలలో అనుమతుల్లేకుండా గ్రిల్స్ తొలగిస్తున్నట్లు ఎన్‌హెచ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అటువంటి అతిక్రమణలపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. తాళ్లపాలెం, కశింకోట రోడ్డుపై స్టాపర్స్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. స్టాపర్స్ ఏర్పాటుకు వివిధ సంస్థలిచ్చే సీఎస్సార్ నిధులను వినియోగించాలన్నారు. జిల్లాలో ఉన్న పంచాయతీ రాజ్ రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని ఆ శాఖ ఎస్‌ఈ(పంచాయతీరాజ్)ని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను నియమిత స్థలాల్లో నిలపాలన్నారు. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. మరణాలు కూడా బాగా తగ్గాయన్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల వద్ద రోడ్లను వెడల్పు చేస్తూ, సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నట్టు తెలిపారు. వివిధ రోడ్లపై ట్రాఫిక్ పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, జిల్లా రవాణా అధికారి ఎం.వీ్రరాజు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- క్రీడాకారులకు డిప్యూటీ సీఎం బూడి అభినందన

దేవరాపల్లి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టిసారించాలని, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అకాంక్షించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలు అనంతపురం జిల్లాలో జరిగాయి. ఇందులో పాల్గొన్న మండలంలోని పెదనందిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో సత్తా చాటారు. వీరిని శుక్రవారం డిప్యూటీ సీఎం అభినందించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గిరిజన యువతి ఆత్మహత్య

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో సత్యశ్రీ (25)అనే గిరిజన యువతి గురువారం తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొయ్యూరు మండలం చుట్టుబంద గ్రామానికి చెందిన దుచ్చరి సాగర్ అనే యువకుడు తనను మూడేళ్లుగా ప్రేమించి, ఇప్పుడు వేరొకరిని వివాహం చేసుకుంటున్నాడని తెలిసి మనస్థాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు సంఘటన స్థలంలో లభించిన లేఖ ద్వారా తెలిసిందని స్థానిక పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వారు చెప్పారు.

హత్యాయత్నం కేసులో తాపీమేస్త్రికి రిమాండ్

కశింకోట: ప్రేయసి కోసం బస్సు డ్రైవర్‌ను బెదిరించి, హత్య చేయడానికి యత్నించిన కేసులో తాపీమేస్త్రికి మేజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అనకాపల్లి నుంచి తేగాడ వైపు వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సును ఈ నెల 22న బయ్యవరానికి చెందిన తాపీమేస్త్రి గడసాల శివసాయి నిలిపి, తన ప్రేయసి కోసం డ్రైవర్ రొంగలి దేముళ్లను కత్తితో హత్య చేయడానికి యత్నించిన సంగతి తెలిసిందే. శివసాయిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాల పోటీలు



విద్యార్థులతో భారత వికాస పరిషత్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం ప్రాథమిక పాఠశాలలో భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం భగవద్గీత శ్లోకాల పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 39 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తమ ధారణ సామర్థ్యంతో చెప్పిన శ్లోకాలు ఆహాతుల్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ఎస్ఏబీ వర్మ, కన్వీనర్ వై.కేశవరావు, కో కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు, నానాజీ, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గొర్లి సూరిబాబుకు మంత్రి అమర్‌నాథ్ అభినందన



గొర్లి సూరిబాబును అభినందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా గొర్లి సూరిబాబుని ప్రభుత్వం నియమించడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం మిందిలోని తన స్వగృహంలో గొర్లి సూరిబాబును మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కలగా గున్నయ్య నాయుడు, మలసాల కిషోర్ పాల్గొన్నారు.

ఆలయాల వార్షికోత్సవం నేడు

కశింకోట : మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో షిరిడి సాయిబాబా, వరసిద్ధి వినాయకుని ఆలయాల వార్షికోత్సవ కార్యక్రమాలను శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు రౌతు చిరంజీవి తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 6,686 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్	3,460	4,000
మొదటి రకం	3,250	3,560
రెండో రకం	3,080	3,500
మూడోరకం	2,980	3,070

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
వీరసింహారెడ్డి	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-29 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 411 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పేదింటి కల.. సాకారమయ్యే వేళ

మనదంటూ సొంతంగా ఓ గూడు ఉంటే చాలు. కలోగంజో తిని గుట్టుగా బతికేయొచ్చు. మన లేమిని ఎగతాళి చేసే అవకాశం లేకుండా గౌరవంగా తిరగొచ్చు. ప్రతి పేద, మధ్య తరగతి జీవి చిరకాల వాంఛ సొంతిల్లు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్–జగనన్న కాలనీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అనకాపల్లి పట్టణంలో కూడా 5,282 కుటుంబాలకు ఇంటిస్థలాలిచ్చారు. ఇపుడు వాటిలో ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు చర్యలు ఊపందుకున్నాయి.



లబ్ధిదారుల నుంచి గృహ నిర్మాణ అనుమతి పత్రాలను స్వీకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు



సచివాలయంలో అకౌంట్ ఓపెన్ చేస్తున్న మహిళ

అనకాపల్లిటౌన్ : అర్హులైన నిరుపేదల సొంతింటి కల నెరవేరే రోజు ఇంకెన్నాళ్లో లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. జగనన్న లే అవుట్లలో స్థలాన్ని పొందినవారు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. లబ్ధిదారు వాటా రూ.35 వేలు జమ చేస్తే, ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు సిద్ధమయింది. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ నిర్దేశిత కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తూ.. లబ్ధిదారుల నుంచి అనుమతి పత్రాలు స్వీకరిస్తున్నారు. కోడూరు, గొలగాం పంచాయతీ పరిధిలోని లే అవుట్లలో కాంట్రాక్టర్ చేపట్టిన నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయి.

స్థోమత లేనివారి కోసం..

పట్టణ పరిధిలో అద్దె ఇళ్లల్లో నివసించే నిరుపేదలకు మండలంలోని సత్యనారాయణపురం, కోడూరు, గొలగాం, మామిడిపాలెం పంచాయతీల పరిధిలో జగనన్న లే అవుట్లు వేశారు. వీటిలో 5,282 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. ఇందులో కొంత మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ప్రారంభించేశారు. అయితే ఆ కాస్త స్థోమత కూడా లేని నిరుపేదల కోసం ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు సంకల్పించింది. ఇందులో లబ్ధిదారు వాటా రూ.35 వేలు చెల్లిస్తే చాలు. మిగిలిన మొత్తం ప్రభుత్వమే భరించి, ఇంటిని నిర్మించి లబ్ధిదారుకు అప్పగిస్తుంది. సాధ్యమైనంత వేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

గతం కంటే మిన్నగా..

గతంలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో ఒక్కో ఇల్లు కేవలం 225 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే ఉండేది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మాత్రం దాన్ని 340 చదరపు గజాలకు విస్తీర్ణానికి పెంచింది. అది కూడా ఇండిపెండెంట్ గృహాలుగా.. అవిభాజ్య వాటా కాకుండా ఎవరి స్థలం వారి పేరిటే ఉండేలా నిర్ణయించింది. కాంట్రాక్టర్లను ప్రభుత్వమే నిర్ణయించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సంకల్పించింది. నిర్మాణ కాంట్రాక్టర్‌కు ఒక్కో ఇంటికి సుమారు 20 టన్నుల ఇసుక, 90 బస్తాల సిమెంట్ రాయితీ ధరలకు అందిస్తోంది. లబ్ధిదారు నుంచి వసూలు చేసే రూ.35 వేలు వారికి నిర్వహణ రుసుముగా కేటాయించినట్టు అధికారులు చెప్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే పట్టణ పరిధిలో 698 మంది రూ.35 వేలు చొప్పున చెల్లింపులు చేశారు. దీంతో మిగిలిన వారు కూడా తమ వాటా చెల్లించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మూడు ఆప్షన్లు

- మొదటి ఆప్షన్‌లో సొంతంగా ఇళ్లు కట్టుకోవాలనుకునే లబ్ధిదారులకు పనుల పురోగతి మేరకు రూ.లక్షా 80 వేలు వారి ఖాతాల్లోకి జమచేస్తారు.
- రెండో ఆప్షన్లో ఇంటి నిర్మాణం సొంతంగా చేసుకునేవారికి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్, స్టీల్, ఇసుక, తలుపులు, శానిటరీ సామగ్రిని తక్కువ ధరకే రివర్స్ టెండర్లో ప్రభుత్వమే కొనుగోలు చేసి అందిస్తుంది. నిర్మాణానికి సంబంధించిన కూలీ వ్యయాన్ని పనుల పురోగతి మేరకు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తుంది.
- మూడో ఆప్షన్లో కింద నిర్మాణ తిప్పలు తాము పడలేమనుకునే లబ్ధిదారులు రూ.35 వేలు చెల్లిస్తే చాలు.. ప్రభుత్వమే నిర్మాణం పూర్తి చేసి, ఇంటిని వారికి అప్పగిస్తుంది. ఆ రూ.35 వేలు కూడా బ్యాంకర్లతో మాట్లాడి పావలా వడ్డీకే అందించేలా చర్యలు తీసుకుంటోంది.

తీరనున్న సొంతింటి కల



ఎన్నో ప్రభుత్వాలను చూశాం. ఏ ఒక్క ప్రభుత్వం కూడా సొంతిల్లు లేని పేదోడు ఉండకూడదన్న ఆలోచనతో పనిచేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆశయంతో మాక్కూడా సొంతంగా ఓ గూడు దొరుకుతుందని ఆనందంగా ఉంది. మాలాంటి పేదలకు ఇంతకన్నా ఇంకేం కావాలి. ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు ఖాతా తెరిచి రూ.35 వేలు చెల్లించా.

– రాధాకుమారి, కోట్నివీధి

కూలీలకు భరోసా



ప్రభుత్వం స్థలాలివ్వడమే కాకుండా కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టే విధానం బాగుంది. ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన సామగ్రి కోసం వెతుకులాట తప్పింది. ఇంటి నిర్మాణానికి బయటి పనులు వదిలేసుకుని మరీ కష్టపడే శ్రమ లేదు. మూకుమ్మడిగా ప్రభుత్వమే చేపట్టడంతో ఖర్చు కూడా తగ్గుతుంది. ఈ విధానం కూలీలకెంతో భరోసానిస్తుంది.

– పీఎస్ లక్ష్మి, ఉడ్‌పేట

698 మంది నగదు చెల్లించారు



ప్రభుత్వమే జగనన్న కాలనీల్లో ఇళ్లను నిర్మించి అప్పగించే విధానంలో ఇప్పటికే 698 మంది లబ్ధిదారులు రూ.35 వేలు చొప్పున చెల్లించారు. ఇది నిరంతర ప్రక్రియ. అర్హత ఉండి, నేటికీ గృహాలు మంజూరు కాని లబ్ధిదారులెవరైనా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తును పరిశీలించి అర్హులని తేలితే 90 రోజుల్లో వారికి ఇంటి స్థలం మంజూరు చేస్తాం.

– పి.వెంకటరమణ, జోనల్ కమిషనర్

నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఈ నెల 26న అనకాపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షత వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్, రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వవిప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌లు విచ్చేస్తారని తెలిపారు. పార్టీ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

పోటీలతో నైపుణ్యం వెలికితీత



నృత్య పోటీల్లో పాల్గొన్నవారితో ఆళ్ల ఓంరామ్

అనకాపల్లిటౌన్ : విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా వారిలో నైపుణ్యాన్ని గుర్తించవచ్చని భారత వికాస పరిషత్ అధ్యక్షుడు, విశ్రాంత హెచ్ఎం ఆళ్ల ఓంరామ్ అన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో పరిషత్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యపోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్ని ప్రోత్సాహించేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో పాల్గొన్న బృందాలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కన్వీనర్ వి.ఈశ్వరరావు, కార్యదర్శి ఎస్ఏబీ వర్మ, కోశాధికారి డి.శివరాము, సభ్యులు వై.కేశవరావు, ఎస్.కోటేశ్వరరావు, బుద్ధ అప్పారావు, ఎస్.గోపాలరావు పాల్గొన్నారు.

యువత కృషితో ప్లాస్టిక్ నిర్మూలన



స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ అన్నారు. స్థానిక గాంధీనగరం సంయుక్త డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణాన్ని కాపాడినట్లయితే, భావితరాల ప్రజలకు మేలు చేసినవారిమవుతామన్నారు. జ్యూట్, కాటన్ సంచులు మాత్రమే వినియోగించాలని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగంతో రోగాల బారిన పడుతున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంయుక్త కళాశాల కరస్పాండెంట్ డి.మహేష్‌బాబు, జోనల్ సిబ్బంది ఆర్.రవికుమార్, డి.గోవిందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయికుల్వంత్‌లో ఇంటర్వ్యూలు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సాయికుల్వంత్ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఐఐటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎన్ఐఐటీ హెచ్ఆర్ పి.తరుణ్‌కుమార్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. శుక్రవారం 200మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్టు పేర్కొన్నారు. తెలంగాణా, ఏపీలోని ఐసీఐసీఐ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఎంపికైన వారి వివరాలను సోమవారం విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో సాయికుల్వంత్ కరస్పాండెంట్ పి.కామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ పంటతో అదనపు ఆదాయం



భీమవరం వద్ద బొప్పాయిలో అంతర్ పంటగా ఆకు కూరల సాగు

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో బొప్పాయిలో అంతర్ పంటలు సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది. మరో వైపు భూసారం పోకుండా రక్షణ లభించనుంది. జి.భీమవరం, అచ్చెర్ల, సింగవరం, చెరకాం, అడ్డాం తదితర గ్రామాల్లో సుమారు 20 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. ఇది సాగు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఫలసాయం వచ్చేసరికి సుమారు ఆరు నెలలు పడుతుంది. ఈలోగా అదనపు ఆదాయం కోసం ఆకు కూరలు, కూరగాయలు అంతర్ పంటలుగా వేసి రైతులు సాగు చేపట్టారు. వీటి ఫలసాయం నెలరోజుల్లోనే వస్తుండటంతో రైతుల మక్కువ చూపుతున్నారు. అదనపు ఆదాయంతోపాటు, ప్రధాన పంట సంరక్షణకు కూడా అంతర్ పంటలు దోహదపడుతున్నాయని చెప్తున్నారు. ప్రధాన పంట బొప్పాయి ఫలసాయం చేతికందే ఆరుమాసాల వరకు వీటి నుంచి ఆదాయం పొందొచ్చంటున్నారు. అంతర్ పంటల వల్ల భూసారం కొట్టుకుపోకుండా పరిరక్షించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

ఉపాధి హాజరు లోపాలపై ఎంపీపీ ఆగ్రహం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : మండలంలోని సత్యనారాయణపురం సచివాలయ పరిధి మూలపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.ధర్మారావు తనిఖీ చేశారు. కూలీల సంఖ్య హాజరుపట్టీని పరిశీలించారు. హాజరులో అనేక లోపాలున్నట్టు గుర్తించారు. అక్కడ వున్న వీఆర్పీ నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి గైర్హాజరైనవారికి హాజరు ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఎంపీపీ కోరారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ రోజుకు కూలీ రూ.257 వచ్చేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కర్రి మజ్జి ఆలివేణి, సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, వైస్ సర్పంచ్ పి.భవానీ, చవ్వాకుల ఈశ్వరరావు, ఎం.సతీష్, పెద్దాడ రామ్ శంకర్, గ్రామకార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాపై ఉచిత శిక్షణ తరగతులు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద ఆశ్రమ ప్రాంగణంలో శనివారం నుంచి ఆయుర్వేద, యోగా శిక్షణా సప్తాహం నిర్వహించనున్నట్టు ఆశ్రమ ప్రచార ప్రతినిధి శ్రీకాళహస్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సులువైన సూక్ష్మ వ్యాయామంతోపాటు, అతిక్లిష్టమైన ఆసనాల నిరంతర సాధనపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శిక్షణకు హాజరు కావాలనుకునే వారు 85199 70966, 93813 41454 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

‘ఉపాధ్యాయ’ ప్లాటినం జూబ్లీ వేడుకలు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

అనకాపల్లిటౌన్ : ఏపీటీఎఫ్‌కు చెందిన ‘ఉపాధ్యాయ’మేగజైన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఈ నెల 26న తిరుపతిలో నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో శుక్రవారం జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ, పూర్వపు కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సన్యాసినాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

వాతావరణ మార్పులపై ఏర్పాటు చేసిన ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో అప్పలరాజు

సబ్బవరం: జిల్లా స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి తెలిపారు. ఈ నెల 22,23వ తేదీల్లో అనకాపల్లిలో జరిగిన ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు ‘పర్యావరణం–వాతావరణ మార్పులు’కు సంబంధించిన కేటగిరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ప్రథమస్థానం లభించిందన్నారు. ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆర్. ప్రసాద్, టీమ్ లీడర్‌గా విద్యార్థిని బి. మోన్షిత వ్యవహరించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో తమ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో కె.కుసుమ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా వారిలో దాగి ఉన్న వినూత్న ఆలోచనలకు ప్రేరణ, సైన్స్‌పై మక్కువ పెరుగుతుందని తెలిపారు.

అభాగ్యులకు ఆహార పొట్లాల పంపిణీ



యాచకులకు ఆహార పొట్లాలు అందిస్తున్న కర్రిబాబు తదితరులు

సబ్బవరం: స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలు,దివ్యాంగులు,వృద్ధులు, యాచకులకు శుక్రవారం ఆహారం పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు ప్రారంభించారు. సబ్బవరం,పెందుర్తి, చినముషిడివాడ,సుజాతనగర్,వేపగుంట,గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సత్యగంగరాజు,డైరెక్టర్ పి. శ్రీనివాసరావు,తారకేశ్వరి,జ్యోతి,సత్య,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

12న భావనారాయణ స్వామి కల్యాణోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి షిర్డీసాయి మందిరం పక్కనున్న ఖాళీస్థలంలో మార్చి 12న భద్రావతీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు తెలిపారు. ఈ మేరకు వివేకానందనగర్ సంఘ కార్యాలయంలో వైద్యులు గెడ్డం దివ్యతేజ చేతుల మీదుగా శుక్రవారం కల్యాణోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పంపాన సత్యనారాయణ, కోడి శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహనరావు, కాకి ధర్మారావు, నామాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోలా గురువులుకు అభినందన



కోలా గురువులుకు అభినందనలు తెలుపుతున్న ముత్యాలు

పరవాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును ఆయన నివాసంలో శుక్రవారం ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, స్థానిక నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మాజీ ఉప సర్పంచ్ మేరుగు చంద్రారావు, సూరాడ పెంటారావు తదితరులు ఉన్నారు.

కబడ్డీ.. కబడ్డీ



రసవత్తరంగా సాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆటగాళ్లు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ పండగను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ శుక్రవారం రసవత్తరంగా సాగింది. పోటీలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ,పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సాయంతో బహుమతులు అందజేయనున్నారు. ఆహ్వాన పోటీల్లో 12 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బొగ్గు లారీలతో అవస్థలు

పరవాడ: హిందూజా పరిశ్రమకు వెళ్తున్న లారీల ద్వారా విడుదలవుతున్న ధూళిని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మీదుగా పరిశ్రమకు రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా విపరీతమైన దుమ్ము, ధూళి ఎగసిపడి రోడ్లకు ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. దీన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పరవాడ: తానాం గ్రామంలో కొలువైన పరదేశిమాంబ మహోత్సవాలను పురస్కరించుకుని మండల స్థాయి క్రికెట్ టోర్నీని సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు శుక్రవారం ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.6 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, ఎంపీటీసీ రొంగలి సునీత తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు పరిహారం ఇవ్వాలి

అనకాపల్లి రూరల్ : ఎస్ రాయవరం మండలం పెనుగొల్లు ధర్మవరం వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాద మృతులకు నష్టపరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో మృతుల కుటుంబాలకు ఆసరాగా ఉండేలా తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. జాతీయ రహదారిపై సరైన భద్రతా చర్యలు తీసుకుని ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఇటీవల జాతీయ రహదారిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.